క్లుప్తంగా

పశువులకు టీకాలు వేయించాలి



టీకా వేస్తున్న పశువైద్యాధికారి అంజలి

కౌటాల: పశువులు ఆరోగ్యంగా ఉండడానికి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని ముత్తంపేట పశువైద్యాధికారి అంజలి అన్నారు. కౌటాల పశువైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని గుడ్లబోరి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఆమె మాట్లాడుతూ పశువులకు టీకాలు తప్పకుండా వేయించాలని, 4 నెలల వయస్సు పైబడిన పశువులన్నింటికి ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని పశువులకు టీకాలు వేస్తామని, రైతులు, పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బిక్షపతి, ప్రకాశ్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: మొక్కలను ప్రతి ఒక్కరూ సంరక్షించాలని ప్రధానోపాధ్యాయుడు సోయం ఇందు రావ్ అన్నారు. మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మొక్కలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి నాలుగు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగసింగ్, సంతోష్, ఆనంద్ రావు, విద్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధరిత్రి దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కెరమెరి: భూసారాన్ని కాపాడి పర్యావరణాన్ని రక్షించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు పిలుపునిచ్చారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవంలో భాగంగా మండలంలోని గోయగాం, ఝరి, కెరమెరి కాంప్లెక్స్ పరిధిలో వివిధ పాఠశాలల్లో ర్యాలీలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను కాపాడాలన్నారు. హెచ్‌ఎంలు భరత్‌కుమార్, నల్లగొండ రమేశ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

29న కేశవనాథ ఆలయ భూముల వేలం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కేశవనాథ ఆలయం భూములు ఒక సంవత్సరం కౌలు సాగు చేసుకునేందుకు ఈ నెల 29న ఉదయం 11.30 గంటలకు కేశవనాథ ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వేణుగోపాల్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ వేలంలో పాల్గొనేవారు ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, పాస్‌ఫొటో జిరాక్స్ కాపీలతో పాటు రూ.50 వేలు నగదు ముందుగానే చెల్లించాలన్నారు. వివరాలకు 96183 07962, 98854 89088 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పోషకాహారం ఆరోగ్యానికి మేలు



వాంకిడి: అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీవో

పెంచికల్‌పేట్: పోషకాహారం ఆరోగ్యానికి మేలు చేస్తుందని సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. పోషణ పక్షోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం గొంట్లపేట్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పాల్గొన్న ఆమె గర్భిణులకు సీమంతం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోషకాహారం లోపంతో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తున్నాయన్నారు. ఈసందర్భంగా మహిళలకు అవగాహన కల్పించారు.

వాంకిడి: చిన్నారులు, బాలింతలు, గర్భిణుల్లో పోషకాహార లోపాలు నివారించేందుకు ఈ నెల 8 నుంచి 22 వరకు పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సీడీపీవో రెబ్కా అన్నారు. మంగళవారం బంబారలోని రైతువేదికలో నిర్వహించిన పోషణ్ పక్వాడ ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సూపర్‌వైజర్లు కుమారి, భారతి, పోషణ్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ తౌఫిక్, జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్ డోంగ్రి ప్రవీణ్ కుమార్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభంజనం

రెబ్బెనలో..



హారిక



జయరాణి

రెబ్బెన: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 109 మందికి 95 మంది, ఒకేషనల్ విభాగంలో 175 మందికి 145 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరంలో జనరల్ గ్రూప్‌లో 184 మందికి 168 మంది, ఒకేషనల్ గ్రూప్‌లో 180 మందికి 166 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో కళాశాల ఉత్తీర్ణతలో జిల్లాలో నాల్గవ స్థానంలో, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రెండో స్థానంలో నిలిచింది. ఫస్టియర్‌లో జి. ప్రవంతి ఎంపీసీ 431 మార్కులు, ఒకేషనల్‌లో సీజీటీ విద్యార్థినీ ఎస్. సాయిప్రియ 489 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. ద్వితీయ సంవత్సరంలో 908 ఎంపీసీ విద్యార్థి పి. మోహన్, ఒకేషనల్ గ్రూప్‌లో ఎంఎల్‌టీ విద్యార్థి ప్రవీన్ 951 మార్కులతో టాపర్‌గా నిలిచాడు. కాగా మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల విద్యార్థులు మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించారు. కళాశాల ఎంపీసీ విద్యార్థిని హారిక 987 మార్కులు, బైపీసీ విద్యార్థిని జయరాణి 981 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు.

దహెగాం కేజీబీవీలో 98శాతం ఉత్తీర్ణత

దహెగాం: ఇంటర్ ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. మండల కేంద్రంలోని స్థానిక కేజీబీవీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 12 మందికి 12 మంది, బైపీసీలో 35 మందికి 34 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో ఇద్దరు ఉండగా ఇద్దరు ఉత్తీర్ణులు కాగా బైపీసీలో 40 మందికి 40 మంది ఉత్తీర్ణులయ్యారు. బైపీసీ ద్వితీయ సంవత్సరంలో ఐశ్వర్య 947 మార్కులు సాధించి కేజీబీవీ టాపర్‌గా నిలిచింది. ఎంపీసీలో జ్ఞానేశ్వరీ 935 మార్కులు సాధించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 75 మందికి 72 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో 74 మంది పరీక్ష రాయగా 54 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. బైపీసీలో పాలె అంజలి 877 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. సీఈసీ సెకండియర్‌లో భీమన్‌కర్ రాణి 827 మార్కులు సాధించింది. 96 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల సిబ్బంది తెలిపారు.



జ్ఞానేశ్వరీ, ఎంపీసీ



ఐశ్వర్య, బైపీసీ



పాలె అంజలి, బైపీసీ



భీమన్‌కర్‌రాణి, సీఈసీ

కెరమెరిలో ఉత్తమ ఫలితాలు



రుక్మాబాయి



మౌనిక

కెరమెరి: మండలంలోని మోడి కేజీబీవీలో విద్యార్థులు 92శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 58 మందికి 53 మంది, సెకండ్ ఇయర్‌లో 36 మందికి 34 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండ్ ఇయర్ బైపీసీ విద్యార్థిని కే రుక్మాబాయి 942 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. ఫస్టియర్‌లో బైపీపీ విద్యార్థిని ఎస్. మౌనిక 366 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇయర్‌లో 111 మందికి 56 మంది, సెకండ్ ఇయర్‌లో 100 మంది విద్యార్థులకు 72 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇక్కడ జే పవన్ కుమార్ ఎంపీసీ (సెకండ్ ఇయర్)లో 923, ఫస్ట్ ఇయర్‌లో పోచన్న (ఎంపీసీ)లో 394 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు.



పవన్ కుమార్

విద్యార్థుల జయభేరి

తిర్యాణి: ఇంటర్ ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. మొదటి సంవత్సరానికి 91 మంది విద్యార్థులకు 65 మంది, రెండో సంవత్సరంలో 121 మంది విద్యార్థులకు 98 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తంగా 212 మంది గాను 163 మంది 76.88శాతం ఉత్తీర్ణత సాధించారు. అదే కళాశాలలో చదువుతున్న గున్నాల పూజిత బైపీసీ విభాగంలో 990 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. కేజీబీవీలో మొత్తం 52 మంది విద్యార్థినులకు 51 మంది 98శాతం ఉత్తీర్ణత సాధించారు. కాగా గిరిజన గురుకుల విద్యాలయంలో రెండో సంవత్సరంలో 100 శాతం, మొదటి సంవత్సరంలో 99శాతం ఉత్తీర్ణత సాధించారు.

మెరుగైన ఫలితాలు..

కౌటాల: కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. ఇంటర్ ఫస్టియర్ జనరల్‌లో 131 మంది విద్యార్థులకు గాను 106 మంది, వొకేషన్‌లో 120 మందికి గాను 92 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్‌లో 79 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో జనరల్‌లో 182 మందికి గాను 166 మంది, వొకేషనల్‌లో 123 మందికి గాను 110 మంది ఉత్తీర్ణత సాధించారు. సెంకడ్ ఇయర్‌లో 91 శాతం ఉత్తీర్ణ సాధించారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో సవిత 915, ఎంపీసీలో విజయ్‌కుమార్ 928 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం వొకేషనల్ గ్రూప్‌లల్లో అజయ్‌కుమార్ 930, రాజేంద్రప్రసాద్ 965 మార్కులు సాధించి ఆయా గ్రూప్‌లో టాపర్లుగా నిలిచారు. ఇంటర్ మొదటి సంవత్సరం వొకేషనల్ గ్రూప్‌ల్లో వైష్ణవి 492, గణేశ్ 480 మార్కులు సాధించి ఆయా గ్రూప్‌లల్లో టాపర్లుగా నిలిచారు. వీరిని కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో మండల కేంద్రంలోని కేజీబీవీలో వందశాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ప్రత్యేక అధికారి అరుణ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యూలో 33 మందికి 33 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. సీఈసీలో 17 మంది విద్యార్థులకు 17 మంది, ప్రథమ సంవత్సరంలో 22 మందికి 19 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంపీహెచ్‌డబ్ల్యూలో 22 మందికి 22 మంది ఉత్తీర్ణత సాధించారు. బెజ్జూర్ జూనియర్ కళాశాలలో 89.9 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సపన్ మండల్ తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 71శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు వివరించారు.

వాంకిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



ఎలగతి సుచరిత



దుర్గం సోన్‌ప్రీత్



ఇటన్‌కార్ రాజేశ్వర్

వాంకిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో ఇర్వా ఆనంద్ 406, బైపీసీలో బామ్నె మంగళ 405, సీఈసీలో మడావి హిందు 431 మార్కులతో టాపర్లుగా నిలిచారు. సెకండ్ ఇయర్ ఎంపీసీలో ఎలగతి సుచరిత 945, బైపీసీలో దుర్గం సోన్‌ప్రీత్ 965, సీఈసీలో ఇటన్‌కార్ రాజేశ్వర్ 890 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారు. ఫస్ట్ ఇయర్‌లో 81 శాతం, సెకండియర్‌లో 86.5 శాతం ఉత్తీర్ణతం సాధించారు.

టెర్రర్ లోడింగ్..!



ఇటీవల ఓవర్‌లోడ్ కారణంగా చింతలమానెపల్లి వద్ద బోల్తాపడ్డ కంకర లారీ

- కంకర టిప్పర్లతో ప్రమాదాలు
- పరిమితికి మించి లోడ్‌తో వెళ్తున్న వాహనాలు
- నిబంధనలు గాలికి
- జాడలేని తనిఖీలు

కౌటాల: జిల్లాలో అధిక భారంతో వెళ్తున్న వాహనాలు రోడ్లపై బీభత్సం సృష్టిస్తున్నాయి. వాహన పరిమితికి మించి లోడ్‌తో వెళ్లే ఆ వాహనాన్ని డ్రైవర్ నియంత్రించలేకపోవడంతో అమాయక ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. భారీ లోడ్ కారణంగా రోడ్లు ధ్వంసం కావడంతోపాటు కాలుష్యం కూడా విపరీతంగా పెరుగుతోంది. ధనార్జన కోసం కంకర క్వారీ యజమానులు పొరుగు రాష్ట్రాలకు కంకరను తరలించే క్రమంలో గ్రామీణ ప్రజలు టిప్పర్ల చక్రాల కింద నలిగిపోతున్నారు. విద్యుత్ గుత్తేదారులు సైతం సంపాదనే ధ్యేయంగా ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వాహనాల్లో అధిక లోడుతో విద్యుత్ స్థంభాలు, ఇతర సామగ్రి తరలిస్తుండడంతో ప్రమాదాలకు కారణమవుతున్నారు. వాగులు, నదుల నుంచి అక్రమంగా ఓవర్ లోడుతో ఇసుక తరలిస్తున్న క్రమంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు అధికారులు తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో వాహనదారులు మేమింతే.. మారమంతే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

డేంజర్ టిప్పర్లు..

కౌటాల మండలం ముత్తంపేట శివారులోని కంకర క్రషర్ కంపెనీలు రాత్రి, పగలు తేడా లేకుండా అధిక లోడుతో టిప్పర్లలో కంకర తరలిస్తున్నారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల్లో నిత్యం ఓవర్ లోడ్‌తో భారీ వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. ఈ టిప్పర్లు, ట్రాక్టర్లు రవాణా, మైనింగ్ శాఖ నిబంధనలు పాటించడం లేదు. 10 టైర్లు ఉన్న లారీ 20 టన్నులతో వెళ్లాల్సి ఉండగా 25 నుంచి 26 టన్నులు, 12 టైర్ల లారీ 26 టన్నులతో వెళ్లాల్సి ఉండగా సుమారు 32 టన్నులకు పైగానే ఓవర్ లోడ్‌తో తిప్పుతున్నారు. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ ఢీ కొని ఏటా పలువురు మృతి చెందుతున్నారు. ట్రాక్టర్లలో సైతం నిర్దిష్ట ప్రమాణాల కంటే ఎక్కువ టన్నులు లోడింగ్ చేయడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాస్తవానికి ట్రాక్టర్ వెనుక భాగంలో కేవలం 10 టన్నులను మాత్రమే తరలించాల్సి ఉండగా 15 నుంచి 17 టన్నుల వరకు లోడింగ్ చేస్తున్నారు. దీంతో వాహనాలు అదుపుతప్పి బోల్తా పడటం, ఇతర వాహనాలను ఢీకొట్టడం జరుగుతోంది. ప్రమాదాలు జరిగినప్పుడు బాధితుల కుటుంబ సభ్యులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తే కొంతమేరకు నష్ట పరిహారం చెల్లించి యజమానులు చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రోడ్లపై కంకర రాళ్లు..

కాగజ్‌నగర్ డివిజన్ పరిధి మండలాల్లోని గ్రామాల్లో కంకర టిపర్లు అధిక లోడుతో వేగంగా ఒకేసారి వరుసగా పదుల సంఖ్యలో దూసుకుపోతుండడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. వాహనాల యజమానుల అత్యాశ, రవాణా శాఖ, మైనింగ్, ఇతర ప్రభుత్వ శాఖల నిర్లక్ష్యం.. వెరసి నిరుపేద కూలీలు, ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయి. వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అధిక లోడ్ కారణంగా కంకర రాళ్లు రోడ్డుపై కుప్పలుగా పడుతున్నాయి. దీంతో వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. పలుమార్లు కంకర రాళ్లు నడిచివెళ్లే వారికి వచ్చి బలంగా తగిలి గాయాలవుతున్నాయి. అలాగే పరిమితికి మించి కంకరతో గ్రామీణరోడ్ల గుండా లారీలు వెళ్తుండటంతో దుమ్ముతో శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. వాహనాల రాకపోకలపై, ఓవర్‌లోడింగ్‌పై నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన రవాణా శాఖ, మైనింగ్, ఇతర సంబంధిత శాఖ అధికారులు నిద్రావస్థలో ఉన్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. కంకరను తరలించే భారీ వాహనాలు పరిమితికి మించిన లోడ్‌తో వెళ్తుండటంతో రూ.కోట్ల నిధులతో వేసిన ప్రధాన రహదారులు ఛిద్రమవుతున్నాయి. లారీ డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వాహనాలను నడుపుతూ ప్రాణాలు తీస్తున్నా అధికారులు 'మామూలు'గా తీసుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఓవర్‌లోడ్‌తో ప్రమాదకరంగా వెళ్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా వాసులు కోరుతున్నారు. అధిక లోడ్‌తో తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు



బెజ్జూర్: ఇందిరమ్మ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్ కుమార్



పెంచికల్‌పేట్: మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి ప్రభాకర్



కెరమెరి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో అంజద్‌పాషా

బెజ్జూర్: ఇండ్లు లేని నిరుపేద కుటుంబాలు, పూరి గుడిసెలో ఉన్నవారిని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా గుర్తించాలని ఎంపీడీవో బండారి ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో 22 గ్రామపంచాయతీల ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాని వారిని గుర్తించాలన్నారు. పూరి గుడిసెలో ఉండి జీవనం సాగించే వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం ఇందిరమ్మ గృహం మోడల్‌పై ఇందిరమ్మ కమిటీలకు వివరించారు. ఎంపీవో గౌరీ శంకర్, ఏఈ మక్బూల్, అభిలాశ్, కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ సభ్యుడు అర్షద్ హుస్సేన్, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దహెగాం: ప్రజాపాలనలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులలో అర్హులను ఎంపిక చేయాలని మండల ప్రత్యేకాధికారి సహజీవన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక రైతువేదికలో ఇందిరమ్మ కమిటీ సభ్యులకు సమావేశం ఏర్పాటు చేశారు. రాజీవ్ యువ వికాసంపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇనోస్, ఏఈ ఆత్మారాం, ఏపీవో కల్పన, తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి ఈఈ ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఇందిరమ్మ కమిటీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులుగా అర్హులను ఎంపిక చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. ఎంపీడీవో అల్బర్ట్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఖదీర్, ఏపీఎం కోనయ్య, ఏవో మనీషా, టీజీబీ మేనేజర్ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. మంగళవారం మండలంలోని కల్లిగాం(కొఠారి) లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం పేద ప్రజలకు పక్కాఇళ్లలో నివాసం ఉండాలని ఇళ్లను మంజూరు చేసిందన్నారు. గ్రామ కార్యదర్శి సతీశ్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మునీర్, న్యానేశ్వర్, జలపతిరావు తదితరులు ఉన్నారు.

పోక్సో కేసులో ఒకరికి జీవిత ఖైదు

ఆసిఫాబాద్: బాలికను మోసగించిన కేసులో ఆసిఫాబాద్ మండలం పర్శనంబాలకు చెందిన ఆటోడ్రైవర్ గెట్కర్ శ్రీకాంత్‌కు జీవిత ఖైదుతో పాటు రూ.60 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ మంగళవారం తీర్పునిచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పర్శనంబాలకు చెందిన బాలిక తల్లి మరణించడంతో నానమ్మ వద్ద ఉంటోంది. అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్ బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు శారీరకంగా కలిశారు. ఈ క్రమంలో 2020 ఏప్రిల్ 11న కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్లగా ఏడు నెలల గర్భిణి అని డాక్టర్లు చెప్పడంతో శ్రీకాంత్‌ను కలిసి తనను పెళ్లి చేసుకోవాలని కోరింది. అందుకు అతను తిరస్కరించడంతో సెప్టెంబర్ 14న ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పీపీ జగన్మోహన్ రావు, లైజనింగ్ అధికారి రాంసింగ్ సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టగా నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

చెట్టుచెట్టుకూ క్యూఆర్ కోడ్



వృక్షాలకు అతికించిన క్యూఆర్ కోడ్

కెరమెరి: ధరిత్రి దినోత్సవంలో భాగంగా మంగళవారం మండలంలోని గోయగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోని వృక్షాలకు క్యూఆర్‌కోడ్‌లు అతికించారు. ఎవరైనా క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చెట్టు పుట్టు పుర్వోత్తరాలు తెలుస్తాయని ఇన్‌చార్జి హెచ్‌ఎం నల్లగొండ్ రమేశ్ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

లబ్ధిదారుల ఎంపికపై సమావేశం

వాంకిడి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపిక విధివిధానాలపై మండల ప్రత్యేక అధికారి రాథోడ్ భిక్కు ఆధ్వర్యంలో మండల స్థాయి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఏపీఎం మహేశ్, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

అనాథలకు ఆర్థిక చేయూత

జైనూర్: అనాథలకు ఆర్థిక సహాయం అందించడమే ప్రధాన లక్ష్యమని బీజేపీ జిల్లా నాయకుడు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సిర్పూర్(యూ) మండలంలోని రాగాపూర్‌ను సందర్శించి అనాథలకు సరుకులు అందించారు.

బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలి

రెబ్బెన: తెలంగాణ ప్రాంతంలోని బొగ్గు గనులను నామినేషన్ పద్ధతిలో సింగరేణి సంస్థకే కేటాయించాలని టీబీజీకేఎస్ ఏరియా కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, సెంట్రల్ కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి మాంతు సమ్మయ్యలు అన్నారు. సింగరేణి పరిరక్షణ, నూతన బొగ్గు గనుల ఏర్పాటు, సంక్షేమ కార్యక్రమాలను విస్తృత పర్చాలని డిమాండ్ చేస్తూ టీబీజీకేఎస్ చేపట్టిన దశలవారి ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీ, కైరిగూడ ఓసీపీతో పాటు ఏరియా వర్క్‌షాప్ లతో టీబీజీకేఎస్ నాయకులు వినతిపత్రాలు అందించారు.

ముంపు భూములకు పరిహారం అందించాలి

రెబ్బెన: గోలేటి గ్రామ శివారులో సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేయబోయే గోలేటి ఓసీపీలో ముంపునకు గురయ్యే భూములకు ఎకరానికి రూ. 25లక్షల పరిహారం, కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్ కోరారు. మంగళవారం బాధిత రైతులతో కలిసి గోలేటిటౌన్‌షిప్‌లో జీఎం విజయ భాస్కర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు.

నాణ్యతతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేపట్టాలి

రెబ్బెన: సింగరేణి సంస్థ నిర్ధేశించిన వార్షిక లక్ష్యసాధనపై దృష్టి పెడుతూనే నాణ్యతతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేపట్టాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కైరిగూడ ఓసీపీలో బొగ్గు నాణ్యతపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

జైనూర్: నూతనంగా నిర్మిస్తున్న మార్కెట్ కమిటీ కార్యాలయ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎమ్మెల్సీ దండె విఠల్‌లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొన్నారు.

కైరిగూడ ఓసీపీని సందర్శించిన ఎమ్మెల్యే

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా కైరిగూడ ఓసీపీని మంగళవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సందర్శించారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావుతో కలిసి తిర్యాణి మండలానికి వెళ్తున్న క్రమంలో కైరిగూడ ఓసీపీని పరిశీలించారు. ఓసీపీలో చేపట్టే బొగ్గు ఉత్పత్తి, ఓబీ వెలికితీత పనులపై కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. సర్వే పరికరాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆ పరికరాన్ని ఉపయోగించి బొగ్గుతీత పనులు పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

తిర్యాణి: మండలంలోని గిన్నెదరికి చెందిన సిడాం భాగ్యలక్ష్మి (58) అదే గ్రామంలో జరిగిన వివాహ వేడుకకు హాజరై సోమవారం రాత్రి ఇంటికి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా తిర్యాణి నుంచి గుడిపేట వైపు వెళ్తున్న దిచక్ర వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు సిడాం కాశీనాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఎంబడి శ్రీకాంత్ తెలిపారు.

'ప్లాట్‌ఫామ్ నిర్మించండి'



చేతిపంపు పరిశీలిస్తున్న రాజేశ్వర్

కెరమెరి: మండలంలోని చిన్న పాట్నాపూర్ గ్రామంలో ఉన్న చేతిపంపునకు ప్లాట్‌ఫామ్ నిర్మించాలని కుమురంభీం ఉత్సవ కమిటీ చైర్మన్ పెందోర్ రాజేశ్వర్ అన్నారు. మంగళవారం ఆయన గ్రామాన్ని సందర్శించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చేతిపంపు పరిశీలించారు. ప్లాట్‌ఫామ్ లేకపోవడంతో మురికి నీరు భూగర్భంలో చేరుతుందన్నారు. చేతిపంపు సమీపంలో మురికి నాలా కూడా లేకపోవడంతో రోడ్డు బురదమయంగా మారుతుందన్నారు. ఈ మేరకు ఎంపీడీవో అంజద్‌పాషాకు అతని కార్యాలయంలో వినతిపత్రం అందించారు.